పేదలకు వరం 'ఆవాస్ యోజన'

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



లబ్ధిదారున్ని కలుసుకున్న ప్రభాకర్

రామంతాపూర్: నెహ్రూనగర్ 287 పోలింగ్ బూత్ పరిధిలో లాభార్థ సంపర్క్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆవాస్ యోజన పథకం ఇంటి నిర్మాణం కోసం లక్షా 25 వేల రూపాయలు పొందిన సముద్రాల శ్రీకాంత్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పేదలు, మధ్య తరగతి ప్రజలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం వరం లాంటిదని ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంబటి భాగ్యలక్ష్మీ, తాళ్ళ మంగాగౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు బాలకృష్ణగౌడ్, ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

మల్లాపూర్: ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ప్రతినిధులతో పాటు దళితులపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ హెచ్‌ఆర్ మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నాచారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అనుచరులు ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న దళితులు, మీడియా మిత్రులపై దాడి చేయడం సబబు కాదన్నారు. దళితులకు, మీడియా మిత్రులకు ఈటల రాజేందర్ క్షమాపణ చెప్పిన తరువాతే మల్కాజ్‌గిరిలో తిరగాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు ముత్యాల జంగయ్య, శ్రీనివాస్, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, దళితులపై దాడిని ఉప్పల్ నియోజకవర్గం ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు.

'దాడులతో బీజేపీకి సంబంధం లేదు'

రామంతాపూర్: ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన దాడి సంఘటనలో బీజేపీకి, ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రామంతాపూర్‌లో బీజేపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీడియాపట్ల బీజేపీకి అపారమైన గౌరవం ఉందని, మీడియాపై దాడిని ఖండిస్తున్నామని చెప్పారు. మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయం అనే సూచనలు కనపడుతుండటంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై లేనిపోని వివాదాలకు తెరతీస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్, రావుల బాలకృష్ణగౌడ్, దేవేందర్ రెడ్డి, వల్లభ జగన్ యాదవ్, రఘుపతిగౌడ్, గోపాల్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'పాటపై తూటా' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూర్యకిరణ్

అల్వాల్: గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'పాటపై తూటా'కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం పాలమూరు ప్రజాసంఘం ఆధ్వర్యంలో భూదేవినగర్‌లో ప్రజాయుద్ధ నౌక గద్దర్ పెద్దకుమారుడు గుమ్మడి సూర్యకిరణ్ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు ప్రజాసంఘం ప్రధాన కార్యదర్శి బైరపోగు సాంబశివుడు, నాయకులు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

లోన్ ఇప్పిస్తామంటూ టోకరా

ఓ స్టోర్ ఉద్యోగుల నిర్వాకం

ఉప్పల్: ఉప్పల్‌లోని ఓ ఎలక్ట్రానిక్ పరికరాల స్టోర్ అడ్డాగా అందులో పనిచేసే ఉద్యోగులే బరి తెగింపు పనులకు పాల్పడ్డారు. యాజమాన్యాలు విధించిన టార్గెట్ కోసం వస్తువుల విక్రయాల మాటున లోన్ ఇప్పిస్తామంటూ నమ్మబలుకుతూ ఏడాదిగా మోసాలకు పాల్పడుతున్నారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాధితుల ఫిర్యాదుతో వీరి మోసం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..స్టోర్స్‌లో పనిచేసే సాగర్..సరూర్‌నగర్‌కు చెందిన జ్యోతి అనే మహిళతో కలిసి కస్టమర్లను మోసగించారు. తమ డిజిటల్ స్టోర్‌లో షాపింగ్ చేస్తే అంతే విలువతో సమానమైన డబ్బును తిరిగి మీకు చెల్లిస్తామని చెప్పి కస్టమర్లను నమ్మించారు. ఆశపడిన కస్టమర్ల సిబిల్ స్కోర్‌ను విజయ్ చెక్‌చేసి మీకు రెండు నుంచి మూడు లక్షల వరకు లోన్ వస్తుందని చెప్పి నమ్మించారు. వారిచేత ఖరీదైన ఐఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు తదితర వస్తువులను కొనిపిస్తున్నారు. కొన్న వస్తువులను జ్యోతి తిరిగి కస్టమర్ల నుంచి తీసుకుని కొంత నగదు చెల్లిస్తూ వస్తోంది. ఇటీవల మాత్రం దాదాపు 40 మంది కస్టమర్ల వద్ద వస్తువులు తీసుకున్నారే కానీ నగదు చెల్లించలేదు. దీంతో మోసపోయిన బాధితులు ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు సాగర్, జ్యోతిలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

పాపన్న సేవలు మరువ లేనివి



చిలుకానగర్‌లో పాపన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఉప్పల్: పేదల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న సేవలు మరువలేనివని పాపన్న సేన అధ్యక్షుడు పంజాల శ్రావణ్, స్వచ్ఛంద సంస్థ చైర్మన్ నెర్ధం భాస్కర్ గౌడ్‌లు కొనియాడారు. పాపన్న 314 వ వర్ధంతిని పురస్కరించుకుని చిలుకానగర్ రోడ్డులో ఆయన విగ్రహానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్జెల సత్యరాజ్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు వేతన భరోసా

- అమలులోకి పెరిగిన అదనపు కూలీ రూ.28
- జిల్లాలో 19,350 జాబ్ కార్డులు.. కూలీలు 21,586 మంది
- ప్రతీ రోజు ఉపాధి పనుల్లో 100 నుంచి 250 మంది కూలీలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్రం దినసరి కూలి పెంచింది. ఈ పెంపు ఏప్రిల్ నుంచే అమలులోకి రానుంది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.272 కూలి చెల్లిస్తుండగా... తాజాగా మరో రూ.28 పెంచింది. దీంతో దినసరి వేతనం రూ.300 చేరింది. 2005 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ప్రారంభం కాగా, తొలుత రూ.87.50 చెల్లించారు. 2022లో రూ.12 పెంచగా, 2023లో రూ.15 అదనంగా చెల్లించడంతో రోజుకు గరిష్టంగా కూలీని రూ.272 నిర్ణయించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కొత్త వేతనాలు అమలు చేస్తూ.. సర్కారు చర్యలు తీసుకుంటోంది. తాజా నిర్ణయంతో సంబంధిత వర్గాల్లో భరోసా ఏర్పడిందనే చెప్పవచ్చు.

19,350 జాబ్ కార్డులు.. 21,586 మంది కూలీలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో మొత్తంగా 19,350 జాబ్ కార్డులకు 21,586 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో చాలావరకు వ్యవసాయ పనులు పూర్తి కావొచ్చాయి. కూలీలు ఉపాధి' బాట పట్టారు. ఉపాధి పనులతో రోజుకు కనీసం రూ.250 నుంచి రూ.270 వరకు వస్తోంది. పెరిగిన వేతనంతో కూలీలకు మరింత ఆర్థిక అండ కలగనుంది. అయితే ఏటా సర్కారు పని దినాల లక్ష్యాన్ని జిల్లాల వారీగా కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో జిల్లా యంత్రాంగం కృషిచేస్తుంది.

ముఖ హాజరు గుర్తింపుతో...

ఉపాధి హామీలో అవకతవకలు అరికట్టేందుకు సర్కారు ఎప్పటికప్పుడు నూతన విధానాల రూపకల్పనలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పనుల్లోకి వచ్చినవారి వివరాల నమోదుకు ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) అనే యాప్‌ను రూపొందించింది. ఆయా కూలీపనులు ప్రారంభానికి ముందు వచ్చిన వారి ఫొటోను పని ప్రదేశంలోనే సెల్‌ఫోన్‌లో తీసి, అందులో ఉదయం 11 గంటల్లోపు అప్‌లోడ్ చేయాల్సి ఉంటోంది. పని ముగిసిన తర్వాత మళ్లీ మరోసారి ఫొటో తీసి పొందుపర్చుతారు. ఈ విధానంతో కూలీల హాజరు పక్కాగా ఉండటంతోపాటు, జరిగిన పనులు, వారికి వచ్చే వేతనం పక్కదారి పట్టకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సైతం వారు పొందుపర్చిన సమాచారాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారులను నియమించారు.

వేసవి భత్యం ఎప్పుడో..?

దినసరి వేతనం రూ.28 వరకు పెంచినా కూలీలు అసంతృప్తితోనే ఉన్నారన్న వాదన వినిపిస్తోంది. గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతో పాటు వేసవి అదనపు భత్యం చెల్లించేవారు. ఈ సమయంలో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా భత్యం ఉండేది. రెండేళ్ల నుంచి దీనిని తొలగించడంతో కూలీల్లో అసంతృప్తి నెలకొంది. పార, గడ్డపార, భత్యాలు కూడా వారానికి ఒకసారి చెల్లించేవారు. గత రెండేళ్ల నుంచి వీటిని నిలిపివేశారని కూలీలు పేర్కొంటున్నారు. నగర శివారు ప్రాంతం కావటంతో వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు వెళ్తే రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలీ చెల్లిస్తుండటంతో ఉపాధిహామీ పనులపై కూలీలు అంతగా ఆసక్తి చూపడంలేదనే వాదన ఉంది.

చిన్న వయసులోనే ఆటిజం గుర్తిస్తే నయం చేయవచ్చు



డాక్టర్ సరోజిని ఆటిజం సెంటర్‌లో అవేర్‌నెస్ డే దృశ్యం

హబ్సిగూడ: హబ్సిగూడలోని డాక్టర్ సరోజిని ఆటిజం, చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం ప్రపంచ ఆటిజం అవేర్‌నెస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజిని మాట్లాడుతూ ఆటిజం వ్యాధిని చిన్న వయసులోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఇటీవల కోవిడ్ తర్వాత ఆటిజం కేసులు పెరిగాయని, ఇది అమ్మాయిల కంటే అబ్బాయిలలో ఎక్కువగా కనిపి స్తోందన్నారు. అనంతరం సినీ గాయకుడు కిరణ్ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ కల్నల్ సీతారాం, సీఈవో చంద్రశేఖర్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలపై కేసులు నమోదు

ఉప్పల్: ఉప్పల్ ప్రెస్‌క్లబ్ లో సోమవారం నిర్వహించిన ఈటల దళిత బాధితుల సంఘం సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, దళిత సంఘాల నేతలు ప్రెస్‌క్లబ్‌లోకి ప్రవేశించి దాడి చేసిన సంఘటనలో 13 మంది బీజేపీ నేతలపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఉప్పల్ పోలీసులు తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను సైతం నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, దాడి విషయంలో కుట్ర కోణం ఏమైనా ఉందా అనే దిశగా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఉత్సాహంగా కల్చరల్ ఎగ్జామ్స్



కల్చరల్ ఎగ్జామ్ సెంటర్‌ను ప్రారంభించిన అశోక్‌కుమార్ పాండే

కుషాయిగూడ: కోల్‌కత్తా అనుబంధ యూనివర్సిటీ చినుకు కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కుషాయిగూడలోని శ్రీ మహా ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో కల్చరల్ ఎగ్జామ్స్ ఉత్సాహంగా సాగాయి. యోగ గురువు అశోక్‌కుమార్ పాండే ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జామ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ నాట్యాచారిని జానకీదేవి పర్యవేక్షణలో సాగిన కల్చరల్ ఎగ్జామ్స్‌కు పరిసర ప్రాంతలైన ఈసీఐఎల్, నాచారం, ఏఎస్‌రావు నగర్, చింతల్ నుంచి సుమారు రెండు వందల మంది హాజరయ్యారు. భరతనాట్యం, వెస్ట్రన్ డ్యాన్స్, కీబోర్డు ప్లేయింగ్ వంటి విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చినుకు కల్చరల్ సొసైటీ ప్రిన్సిపాల్ అనుదీప్తి, శ్రీ మహా ఇనిస్టిట్యూట్ అధినేత లావణ్య, గురువులు ఇందుమతి, రజిత, లలిత, లక్ష్మీదేవి, శ్రీదేవి, సాయిమహల్య, మూర్తి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలి

చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్, అన్నోజిగూడ, నారపల్లి ప్రాంతాల్లో కృష్ణా నీటిలో మున్సిపల్ నీరు కలుస్తోందని చైర్మన్ కొండల్‌రెడ్డి జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. రెండు రకాల నీళ్ల కలిసిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని చోట్ల పాడైపోయిన పాత పైప్‌లైన్‌లు ఉన్నాయని, వాటిని మార్చి కొత్త పైప్‌లైన్‌లు వేయాలన్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్‌లో సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకుల నుండి కనెక్షన్లు ఇచ్చి నీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించాలన్నారు. జీఎం శ్రీనివాస్‌రెడ్డికి సుదర్శన్ రెడ్డి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అన్నిరంగాల్లో రాణించే విధంగా తర్ఫీదు



అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న రాంచంద్రారెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రత్యేక తర్ఫీదునిస్తున్నట్లు న్యూటన్ గ్రామర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కె.రాంచంద్రారెడ్డి అన్నారు. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలోని న్యూటన్ గ్రామర్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నర్సరీ నుంచి 10వ తరగతి వరకు చదువుతోపాటు వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపర్చిన ఉపాధ్యాయురాలు జి. నాగలక్ష్మికి రూ 5 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ప్రిన్సిపాల్ వై.కృష్ణ, ఇన్‌చార్జీలు జితేందర్‌రెడ్డి, మిస్బరాణి, ఎం.ఎ.లూసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధీరత్వానికి ప్రతీక పాపన్నగౌడ్: ఎమ్మెల్యే మర్రి

గౌతంనగర్: ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, ఆయన ఆశయాలను కొనసాగించాలని, నేటి తరానికి ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని, మినీ ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం గౌతంనగర్ డివిజన్ యాదవ్‌నగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, తెలంగాణ కల్లుగీత పారిశ్రామిక సంఘం నాయకులు ఐలయ్యగౌడ్, మిట్టపల్లి విజయ్‌గౌడ్, కనకరాజుగౌడ్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు



విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ తదితరులు

ఓల్డ్ అల్వాల్‌లో...

అల్వాల్: అల్వాల్‌లోని ఆయన విగ్రహానికి తెలంగాణ గౌడ సంఘం ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావుగౌడ్ హాజరై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నేమూరి సాయిరాంగౌడ్, రాజుగౌడ్, భాస్కర్‌గౌడ్, మారుతిగౌడ్, సాయిచరణ్‌గౌడ్, మల్లిఖార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘననివాళి

కుషాయిగూడ: బహుజన వర్గాల పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఈసీఐఎల్, చర్లపల్లిలో మంగళవారం నిర్వహించారు. చర్లపల్లిలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసీఐఎల్ చౌరస్తాలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాళ్ల ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్‌గౌడ్, పాండాల శివకుమార్‌గౌడ్, పనగట్ల చక్రపాణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్నగౌడ్‌కు ఘననివాళి

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి మంగళవారం గౌడ సంక్షేమ సంఘం నేతలు పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ ప్రతినిధులు వెంకన్నగౌడ్, సోమశేఖర్‌గౌడ్, బొడ్డుపల్లి సత్యనారాయణగౌడ్, మధుగౌడ్, మల్లేష్‌గౌడ్, వినయ్‌గౌడ్, అనిల్‌గౌడ్, శ్యామ్‌గౌడ్ పాల్గొన్నారు.

బహుజనుల మార్గదర్శి సర్వాయి పాపన్న

మల్లాపూర్: బహుజనుల మార్గదర్శి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశ యాలను కొనసాగిద్దామని మల్లాపూర్ మీర్‌పేట్ గౌడ సంఘం ప్రతినిధులు కొనియాడారు. మంగళవారం పాపన్నగౌడ్ 314 వర్ధంతి సందర్భంగా ఓల్డ్ మల్లాపూర్‌లోని కౌండిన్య భవన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మీర్‌పేట్ గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



చర్లపల్లిలో నివాళులు అర్పించిన బొంతు శ్రీదేవి



పాపన్నకు నివాళి అర్పిస్తున్న తుంగతుర్తి రవి, గౌడసంఘం నాయకులు

మేడిపల్లిలో సర్వాయి పాపన్నకు ఘననివాళి

మేడిపల్లి: సర్దార్ సర్వాయి పాపన్న 314వ వర్ధంతి వేడుకను మేడిపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బాలక్రిష్ణ గౌడ్, కిరణ్ గౌడ్, అంజిగౌడ్, వాణిగౌడ్, శ్రీకాంత్ గౌడ్, సుధాకర్ గౌడ్, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



పాపన్నకు నివాళులర్పిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

కాలనీలకు 'లింక్' కట్

- తవ్వి వదిలేశారు.. రెండు నెలలుగా స్థానికుల అవస్థలు
- చర్చికాలనీ నుంచి వెళ్లే రోడ్డు దుస్థితి

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని చర్చి కాలనీ నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం, వివిధ కాలనీలకు వెళ్లే లింక్ రోడ్డును ఉప్పల్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు తవ్వి వదిలేశారు. దీంతో నిత్యం వేలాదిమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చర్చి కాలనీ నుంచి దాదాపుగా 20 కాలనీలకు, బోడుప్పల్ వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. రెండు నెలల క్రితం పద్మావతి కాలనీ వద్ద రోడ్డు ఎత్తుగా ఉందని, ఇళ్లలోకి నీరు వస్తోందని సీసీ రోడ్డును దాదాపుగా 40 మీటర్ల వరకు తవ్వారు. అయితే, రాకపోకలకు అనువుగా ఉన్న సీసీ రోడ్డును అడ్డంగా తవ్వి వదిలేయడంపై స్థానికులు, ఇతర కాలనీవాసులు తీవ్రంగా మండి పడుతున్నారు. ఇలా అనాలోచితంగా అధికారులు రోడ్డు తవ్వుతుండగా స్థానికులు అభ్యంతరం తెలపడంతో పనులను పక్కనే పెట్టేశారు. ప్రతి మంగళవారం వారాంతపు సంత కూడా ఈ రోడ్డుపై నడుస్తోంది. గత పదిరోజులుగా చిన్న, చిన్న వ్యాపారులకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పునరుద్ధరించాలని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని ఆయా కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.



ఉప్పల్ పద్మావతి కాలనీ వద్ద రహదారిని తవ్వి వదిలేసిన దృశ్యం